ఈనాడు ఏలూరు

బుధవారం అక్టోబరు 9, 2024 | 13




జంగారెడ్డిగూడెం: కరెన్సీ నోట్ల అలంకరణలో గంగానమ్మ, విజయదుర్గమ్మ

మహాలక్ష్మీ లోకశోక వినాశిని

దేవీ నవరాత్రుల ఆరో రోజు మంగళవారం జంగారెడ్డిగూడెంలో అమ్మవార్లు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత గంగానమ్మను రూ.2.30 కోట్లు, విజయదుర్గమ్మను రూ.కోటితో, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.72 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం**

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు: కలెక్టర్



దూర దృశ్య సమావేశంలో పాల్గొన్న వెట్రిసెల్వి, అధికారులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కార్యక్రమ నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి దృశ్య సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వెట్రిసెల్వితో పాటు జడ్పీ జీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డ్వామా పీడీ కేవీ సుబ్బారావు, డీపీవో కె.అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్‌ఆర్ఈజీఎస్ ద్వారా సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి, వారిని భాగస్వాములుగా చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-శ్రీకాకుళం రోడ్డుకు ఈ నెల 9, 10, 11, 12, 14, 15 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం రోడ్డు- విజయవాడకు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు తిరుగుతాయన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కోటవలసన, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్ల మీదుగా ప్రత్యేక రైళ్లు పయనిస్తాయని వారు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


మద్యం దుకాణాలకు 12 వేల దరఖాస్తులు



ఎక్సైజ్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారుల రద్దీ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మద్యం దుకాణాలకు సుమారు 10 వేల నుంచి 12 వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ నాగప్రభుకుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ కార్యాలయం వద్ద దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. అనంతరం డీఎస్పీ రవిచంద్రతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అయిదు రోజుల్లో 9 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని చెప్పారు. జంగారెడ్డిగూడెంలో రద్దీ దృష్ట్యా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే పెంచుతామని చెప్పారు. దరఖాస్తు ప్రక్రియలో ఎవరైనా ఆటంకం కలిగిస్తే తమ దృష్టికి తేవాలని డీఎస్పీ కోరారు. ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు పాల్గొన్నారు. దరఖాస్తుదారులతో ఎక్సైజ్ కార్యాలయం సందడిగా మారింది.

అవినీతి మోత




నిబంధనలకు విరుద్ధంగా క్వారీల నిర్వహణ

జనావాసాల నడుమ పేలుళ్లు

ఈనాడు, ఏలూరు, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో క్వారీల తవ్వకాలకు అడ్డగోలుగా అనుమతులిచ్చేస్తున్నారు. జనావాస ప్రాంతాల్లో బాంబులు పెట్టి పేలుస్తున్నా..అధికారులకు వినిపించడం లేదు. గోరంత అనుమతులుంటే కొండంత తవ్వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులకు కనిపించని దుస్థితి నెలకొంది.

ఇది చింతలపూడి మండలం పాతిమాపురంలోని నల్లరాయి క్వారీ. దీని చుట్టూ గ్రామస్థులు నివాసం ఉంటున్నారు. సమీపంలో పంట పొలాలున్నాయి. ఇందులో నిత్యం బాంబులు పెట్టి రాళ్లు పగలకొడుతుంటారు. దుమ్ము ధూళితో విపరీతమైన కాలుష్యం ఏర్పడుతోంది. ప్రజలకు ఇన్ని ఇబ్బందులున్నా అధికారులు అనుమతులిచ్చేశారు. ఎలా అన్నది కోటి రూపాయల ప్రశ్న.

అడ్డగోలుగా అనుమతులు.. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల ప్రకారం క్వారీ అనుమతుల విషయంలో కొన్ని నిబంధనలున్నాయి. పేలుడు అవసరం లేని క్వారీలు జనావాసానికి 100 మీటర్ల అవతల ఉండాలి. పేలుడు అవసరం ఉన్న క్వారీలు జనావాసానికి 200 మీటర్ల అవతల ఉండాలి. బాంబులు పేల్చాలంటే డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అనుమతులుండాలి. మైన్స్ మేనేజర్ పర్యవేక్షణలోనే పేలుళ్లు జరగాలి. పాతిమాపురం క్వారీలో నిత్యం బాంబులు పేలుస్తారు. క్వారీకి ఆనుకొని ఊరు ఉంది. దీంతో ఇళ్లు పునాదులతో సహా కదిలిపోతున్నాయి. గోడలు పగిలిపోతున్నాయి. కళ్ల ముందు కనిపిస్తున్నా అధికారులు అడ్డగోలుగా అనుమతులిచ్చేశారు.



ఈ చిత్రంలో పగిలిన గోడ ఏ భూకంపం వల్లనో.. ప్రకృతి విపత్తు వల్లనో పగలేదు. పాతిమాపురం క్వారీలో పేల్చే బాంబుల దాటికి ఇలా అయ్యింది. గ్రామంలో చాలా ఇళ్లు ఇలా బీటలు పడిపోయాయి. క్వారీ పైనుంచి ఎప్పుడు రాళ్లు పడతాయో తెలియక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ఇప్పటికే కొందరికి రాళ్లు తగిలి గాయాలయ్యాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

ప్రమాదంతో సహజీవనం.. బాంబులు పేల్చినప్పుడు వెలువడే కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియా తదితర ప్రమాదకర వాయువులు వెలువడటంతో భరించలేని దుర్గంధం వస్తోంది. వీటి వల్ల ఊపిరితిత్తులు, వినికిడి, కళ్ల, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. గుండెపోటు, కొన్ని రకాల క్యాన్సర్ కూడా వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బాంబులు పేల్చే ముందు కనీసం గ్రామస్థులకు సమాచారం కూడా ఇవ్వడం లేదు.

అక్రమాలు అడ్డగా.. జిల్లాలో ద్వారకాతిరుమల, చింతలపూడి, టి.నరసాపురం, ముసునూరు, చాట్రాయి తదితర మండలాల్లో అనుమతులున్న క్వారీలు 22 ఉన్నాయి. అనుమతులు లేకుండా నిర్వహించేవి పదుల సంఖ్యలో ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం గంగవరంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఉంగుటూరు, భీమడోలు, నూజివీడు ముసునూరు మండలాల్లో అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. అనుమతులున్నా వాటిని మించి తవ్వేస్తున్నారు. దీనిపై గనుల శాఖ ఏడీ రవికాంత్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇది చాట్రాయి మండలం పోతనపల్లి శివారులోని క్వారీ. అధికారుల లెక్కల్లో మాత్రం ఇందులో పనులు జరగడం లేదు. క్షేత్రస్థాయిలో యథేచ్ఛగా పనులు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం గనుల శాఖకు రాయల్టీ చెల్లించకపోతే పనులు నిలిపివేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకున్నట్లు దాఖలాలు లేవు.

జిల్లాలో అనుమతులున్న క్వారీల సమాచారం		
22 మొత్తం సంఖ్య	13 ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్నవి	9 తవ్వకాలు నిలిచిపోయినవి

ఆగని ఆశీలు దందా!

పట్టణాల్లో గుత్తేదారుల ఇష్టారాజ్యం

బెంబేలెత్తుతున్న చిరు వ్యాపారులు



కాగితంపై రాసిస్తారు.. 'నేను నాలుగేళ్లుగా జేపీ కూడలిలో ఆకు కూరలు అమ్ముకుంటున్నా. రోజూ నా వద్ద రూ.50 కట్టించుకుంటున్నారు. దానికి రసీదు ఇవ్వరు. కావాలంటే రూ.100 నుంచి రూ.150 అవుతుందని చెబుతున్నారు. మరీ గట్టిగా అడిగితే తెల్ల కాగితంపై రాసిస్తారు. ఇక్కడ వసూళ్లు మరీ దారుణంగా ఉన్నాయి'అని మల్లిశెట్టి వెంకటేశ్వరరావు వాపోయారు.

జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు పట్టణం, ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి పట్టణాల్లో ఆశీలు గుత్తేదారుల దోపిడీ కొనసాగుతోంది. వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తున్నారు. గెజిట్ ప్రకారం చెల్లించాల్సిన నిర్ణీత పైకం కంటే రెండు మూడు రెట్లు అధికంగా వసూలు చేసి దండుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సరకులు, కూరగాయలు తీసుకొచ్చే వాహనాల నుంచి రూ.వందల్లో వసూలు చేస్తున్నారు.

పాత గుత్తేదారుడికే.. గడువు ముగిసినా పాత గుత్తేదారుడికే ఏలూరులో ఆశీలు వసూలు చేసుకొని అవకాశం కల్పించారు. మూడు సార్లు వేలానికి పిలిచి వాయిదా వేశారు. గత వేసవి సీజన్‌లో ఇక్కడ ఆశీలు సొమ్ము భారీగా దోపిడీకి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆశీలు వేలం నిర్వహించారు.



నిర్బంధ వసూళ్లు.. రగ్గులు, స్వెట్టర్లు విక్రయించేందుకు రాజస్థాన్ రాష్ట్రం నుంచి కొందరు చింతలపూడికి వచ్చారు. వారి వద్ద రోజూ రూ.30 చొప్పున నిర్బంధంగా వసూలు చేస్తున్నారు. కొబ్బరి బొండాలు అమ్మేవారి నుంచి ప్రతి చిరువ్యాపారి వద్ద అధిక మొత్తంలో వసూళ్లు సాగుతున్నాయి.

ఎవరినీ వదలరు.. గుత్తేదారుల దందాలతో పండ్లు, కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. తట్టనెత్తిన పెట్టుకొని తేగలు అమ్మేవారి నుంచి ముగ్గు అమ్మేవారి వరకు ఎవరినీ వదలడం లేదు. జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న అక్రమాలపై ఇటీవల పురపాలక కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. నూజివీడు, ఏలూరులలో గత వైకాపా పాలనలో ఆశీలు వసూలు పూర్తి అవినీతిమయంగా మారింది. అనధికార వసూళ్లు, అందినకాడికి దోచుకోవడం, పురపాలకాల ఆదాయానికి గండి కొట్టడంతో గుత్తేదారులు తమ చేతివాటం చూపారు. ఏలూరు నగరంలో సుమారు 20 వేల మంది చిరు వ్యాపారులుంటారు. వీరి నుంచి భారీగా దోచుకున్నారు.



రోజూ రూ.30 .. 'ద్విచక్ర వాహనంపై కొబ్బరి బొండాలు అమ్ముకుంటా. ఆశీలు రూ.10 చెల్లించాలి. కానీ రోజూ రూ.30 వసూలు చేస్తున్నారు'అని నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ రోడ్ల పనులు లేనట్లే..!

25 శాతం లోపు చేసినవి రద్దయ్యే అవకాశం

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్లు బాగోలేదంటే.. నిధులు మంజూరు చేశామన్నారు. పనులు చేపడుతున్నాం బిల్లులు చెల్లించమంటే హెడ్ఆఫ్ అకౌంట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది.. సరి చేస్తామన్నారు. అలా అంటూనే వైకాపా ప్రభుత్వంలో ప్రజలను ఊరించి ఏళ్లు గడిపేశారు. తీరా ఇప్పుడు కనీసం 25 శాతం కూడా కాని పనులు రద్దవుతాయంటున్నారు.

ఐటీడీఏ ఉప ప్రణాళిక నుంచి రూ.15.35 కోట్లు.. ఆ రహదారులపై గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా మారడంతో పలు విజ్ఞప్తుల మేరకు 2021లో ఐటీడీఏ ఉప ప్రణాళిక నుంచి రూ.15.35 కోట్లు మంజూరు చేశారు. ఆయా మార్గాలను బీటీ రోడ్లుగా మార్చేందుకు టెండర్లు పిలిచి గుత్తేదారులకు పనులు అప్పగించారు. తీరా ప్రారంభించే సమయంలో ఒప్పందానికి సంబంధించి హెడ్ ఆఫ్ అకౌంట్‌లో సాంకేతిక లోపం ఉన్నట్లు గుర్తించిన గుత్తేదారు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు.



బోడిగూడెం, బర్కిట్‌నగరం మధ్య రాళ్లు తేలిన రహదారి

ప్రయాణం నరకప్రాయం.. పోలవరం దేవరగొంది కాలనీ నుంచి రేపల్లెవాడ వెళ్లే మార్గంలో భారీ గోతులు పడటంతో చినుకు పడితే చెరువులా మారుతుందని, రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని 22 గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుగా తిరిగే ఆర్టీసీ బస్సులు ఊయల మాదిరి ఊగుతున్నాయని, 10.50 కి.మీ. ప్రయాణం పూర్తి చేసేసరికి కాళ్లు, చేతులు పనిచేయడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

డీఈ ఏమన్నారంటే.. ఆయా రహదారుల విషయమై రోడ్లు భవనాలశాఖ డీఈ హరికృష్ణ మాట్లాడుతూ పనులు ప్రారంభించని, కనీసం 25 శాతం కూడా పూర్తి కాని వాటి ఒప్పందాల రద్దుకు అవకాశం ఉందన్నారు. మళ్లీ తాజా అంచనాలతో ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.

అవి.. ఇవే..! కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం నుంచి రేగులకుంట వరకు 19 కి.మీ. (రూ.6.20కోట్లు), పోలవరం నుంచి రేపల్లెవాడ వరకు 10.50 కి.మీ. (4.15 కోట్లు), జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు నుంచి పూచికపాడు వరకు తొమ్మిది కి.మీ(రూ.5కోట్లు) మేర రహదారుల అభివృద్ధి పనులు రద్దవుతున్నట్లు సమాచారం.

240 టన్నుల కందిపప్పు కేటాయింపు



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాకు అక్టోబరు నెలకు సంబంధించి 240 టన్నుల కందిపప్పు కేటాయించినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి తెలిపారు. జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాలకు ఇప్పటికే సరఫరా చేశామన్నారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేస్తామన్నారు. నవంబరులో కందిపప్పు కేటాయించడానికి పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యాలయం అధికారులు వివరాలు తీసుకున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో కందిపప్పు రూ.165 ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై కార్డుదారులకు రూ.67కు విక్రయిస్తున్నట్లు మంగళవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ద్వారకాతిరుమలలో భారీ వర్షం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల మధ్య 6.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ద్వారకాతిరుమల మండలంలో అత్యధికంగా 49.6, మండవల్లిలో అత్యల్పంగా 1.2 మి.మీ. వర్షం కురిసింది. భీమడోలు 19.2, వేలేరుపాడు 17.0, పోలవరం 17.0, కామవరపుకోట 9.6, ముదినేపల్లి 9.2, ఉంగుటూరు 8.6, దెందులూరు 6.2, లింగపాలెం 5.6, ముసునూరు 4.8, జంగారెడ్డిగూడెం 4.4, కలిదిండి 4.4, కొయ్యలగూడెం 3.4, బుట్టాయగూడెం 3.0, కుక్కునూరు 2.2, కైకలూరు 1.8, పెదవేగి 1.8 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు



ఎస్పీ పర్యవేక్షణలో పోలీసుల తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణ, చోరీలను అరికట్టేందుకు రాత్రివేళ గస్తీని ముమ్మరం చేశారు. ఈ నెల 7న అర్ధరాత్రి దాటాక నగరంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పర్యటించారు. రాత్రి గస్తీ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గస్తీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే అదుపులోకి తీసుకొని, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా సమర్థంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం రైల్వేస్టేషన్‌కు వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడారు. పాత బస్టాండ్‌లో పెట్రోలింగ్‌ను పరిశీలించారు. చివరగా కలపర్రు టోల్ గేటు వద్దకెళ్లి పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఆయన వెంట డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎస్సైలు దుర్గాప్రసాద్, శారదా సతీశ్, సిబ్బంది ఉన్నారు.

కిలో టమాటా రూ.50



ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో మంగళవారం నుంచి కిలో టమాటా రూ.50కు విక్రయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి వి.మహేంద్రనాథ్ తెలిపారు. ఒక్కో కుటుంబానికి 2 కిలోల చొప్పున టమాటాలు అందజేస్తున్నామన్నారు. వినియోగదారు ఆధార్, రేషన్ కార్డుల్లో ఏదొకటి రైతు బజారులోని కేంద్రాల్లో చూపి రాయితీ టమాటాలు పొందవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'టెట్'కు 39 మంది గైర్హాజరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు'(టెట్) కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 370 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా- 39 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో ఎస్.అబ్రహం తనిఖీ చేశారు.

రైతేరాజు | సేంద్రియ సాగు.. మాధుర్యం బాగు! | ఇలా చేస్తే.. జామలో మంచి దిగుబడులే! | 14లో

మెరుగైన వైద్య సేవలందిస్తాం..

డయల్ యువర్ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో



ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే దిశగా చర్యలు తీసుకుంటామని ఏలూరు డీఎంహెచ్‌వో ఎస్.శర్మిష్ఠ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామని, సౌకర్యాలు మరింత మెరుగుపరుస్తామని 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎంహెచ్‌వో'లో వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా పలువురు తమ సమస్యలను ఫోను ద్వారా డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

? **సమస్య:** ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణానికి గతంలో 7.5 సెంట్ల స్థలం కేటాయించారు. అక్కడ సగం భవనాన్ని నిర్మించి వదిలేశారు. **- బాబ్జి, ద్వారకాతిరుమల.**

➠ **డీఎంహెచ్‌వో:** ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడ భవనం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో సబ్‌సెంటర్ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలందేలా చూస్తాం.

? గ్రామాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇష్టానుసారంగా వైద్యం చేసి ప్రజల వద్ద నుంచి వేలకు వేలు కాజేస్తున్నారు. **- అప్పారావు, గుండుగొలను.**

➠ ఆర్ఎంపీ, పీఎంపీలు కొంత మందికి ఇప్పటికే షోకాజు నోటీసులు ఇచ్చాం. కేవలం ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని వాళ్లను ఆదేశించాం. రోగులకు జబ్బు ముదిరే వరకూ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం.

? మా బాబు ఫిట్స్, కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. వైద్యానికి చాలా డబ్బు ఖర్చు అవుతుంది. సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించండి. **- జగదీష్, జంగారెడ్డిగూడెం.**

➠ ఎన్టీఆర్ భరోసా వర్తిస్తుందేమో చూసి సహాయం చేస్తాం. సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించే అధికారం మాకు లేదు.

? ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మాతా శిశు విభాగంలో ఒక్క స్కానింగ్ యంత్రం మాత్రమే పనిచేస్తుంది. దీంతో స్కానింగ్ చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. **- వెంకటరమణ, పత్తేబాద, ఏలూరు.**

➠ వైద్య కళాశాల పరిధిలో ఆసుపత్రి ఉంది. ఈ సమస్యను డీఎంఈ దృష్టికి తీసుకెళ్తాం. కలెక్టర్ దృష్టిలో కూడా పెట్టి పరిష్కారమయ్యేలా చూస్తాం.

? గొంతు క్యాన్సర్ వచ్చింది. పింఛన్ ఇప్పించండి. **- లక్ష్మణరావు, సత్రంపాడు, ఏలూరు.**

➠ క్యాన్సర్ వ్యాధికి పెన్షన్ వచ్చే అవకాశం లేదు.

? ఏలూరు వన్‌టౌన్ సదరన్ వీధిలో కుళాయిల నుంచి మురుగు నీరు వస్తోంది. ఈ ప్రాంతంలో అనేక మంది అనారోగ్యాలకు గురవుతున్నారు. **- రాజేంద్రజైన్, వన్‌టౌన్ సదరన్ వీధి.**

➠ ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం. పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం. వైద్య సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపి సేవలందిస్తాం.

? ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో థైరాయిడ్ పరీక్షలు చేయటం లేదు. **- ఇస్మాయేలు, తాడువాయి.**

➠ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. థైరాయిడ్ పరీక్షలు జిల్లా కేంద్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రి లోనే చేస్తున్నారు. దీనికి సంబంధించిన యంత్రాలు, ప్రత్యేక టెక్నీషియన్‌లను ప్రభుత్వం అన్ని చోట్లా ఏర్పాటు చేయలేదు.

మత్స్యం.. నిలువెల్లా నిర్లక్ష్యం..!



నిరుపయోగంగా చేపపిల్లల పెంపకం తొట్టెలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే :

లక్ష్యం : రైతులకు రాయితీపై చేప పిల్లల సరఫరా, జలాశయాల్లో మత్స్య సంపద పెంపొందించడం.

చెరువులు 2 | కేటాయించిన ట్యాంకులు : 5



ఒకప్పుడు నాలుగు నుంచి అయిదు ఎకరాలు ఉన్న మత్స్య శాఖ చెరువు ఇది. దాదాపు రెండు ఎకరాలు ఆక్రమణకు గురైంది.

తణుకు పట్టణంలోని మత్స్యశాఖ చెరువులు సరైన నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్యాంకుల్లో చేపపిల్లలను పెంచి ఉత్పత్తి చేసేవారు. కాలక్రమేణా మత్స్య శాఖ వీటి నిర్వహణ పట్టించుకోలేదు. 2018లో మిషన్ ఫింగర్ లింక్స్ స్కీం పేరుతో అప్పటి ప్రభుత్వం చెరువు పూడిక తీయించి చేప పిల్లలను పెంచడం ప్రారంభించారు. రెండేళ్ల కిందట మరోసారి చెరువు తవ్వించి ఏడాది పాటు చేపపిల్లలను ఉత్పత్తి చేశారు. వర్షాలకు చేపనారు కొట్టుకుపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు.

✦ తణుకులోని స్థానిక సిద్ధేశ్వర స్వామి ఆలయం ఆనుకొని ఉన్న నాలుగు నుంచి అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మత్స్యశాఖ చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. మత్స్యశాఖ సిబ్బంది కార్యాలయం వద్ద లేకపోవడం ఇక్కడ శాశ్వత కట్టడాలు నిర్మించారు. "డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సమస్య ఏర్పడింది. చెరువు చుట్టూ నీరు వెళ్లేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. జలవనరులు శాఖ అధికారులు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. ఆక్రమణలపై దృష్టి సారించి, సమస్య పరిష్కరిస్తాం" అని తణుకు మత్స్యశాఖ సహాయ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ శివ రామకృష్ణ తెలిపారు.

ధనలక్ష్మీ రూపం.. స్వర్ణ కిరీటంతో రాజసం

నిడమర్రు, న్యూస్‌టుడే: మండలపర్రులో ఉమా నీలకంఠేశ్వరస్వామి క్షేత్రంలో అమ్మవారికి గ్రామస్థుల విరాళాలు రూ. 42 లక్షలతో తయారు చేయించిన 500 గ్రాముల బంగారు కిరీటాన్ని మంగళవారం అలంకరించారు. తొలుత అమ్మవారికి స్థానికులు టన్నున్నర సారె, స్వర్ణ కిరీటాన్ని గ్రామ దేవత జమ్ములమ్మ ఆలయానికి తీసుకెళ్లి... అక్కణ్నుంచి ప్రదర్శనగా పంచాయతన క్షేత్రానికి తీసుకొచ్చారు. అక్కడ కిరీటానికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. ఆపై రూ. 50 లక్షల నగదుతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకట సుబ్బరాజు, శంకరం, కె.రామచంద్రరాజు, పి.కృష్ణంరాజు తదితరులు పర్యవేక్షించారు.



మండలపర్రులో అమ్మవారు

స.హ. చట్టానికి జవసత్వాలు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఈనాడు డిజిటల్, భీమవరం: సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరిన దరఖాస్తుదారుడికి, సంబంధిత అప్పిలేట్ అధికారికి ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మంగళవారం గుంటూరు నుంచి నిర్వహించిన తొలి ఆన్‌లైన్ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన 14 మంది అధికారులు, దరఖాస్తుదారులతో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు. దీనిలో జిల్లాకు చెందిన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

మార్పు తెచ్చే దిశగా.. పాలనలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో 2005లో సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఈ చట్టం అమలు తీరును అధికారులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమాచారం కోరే వారికి వేధింపులు ఎదుర్కోవాల్సి వచ్చేది. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని సెక్షన్ (1) ప్రకారం 30 రోజుల వ్యవధిలో అందించాలి. ఈ నిబంధనను అసరాగా చేసుకొని చాలామంది అధికారులు గడువు వరకు జాప్యం చేస్తున్నారు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగానే సమాచారం ఇవ్వకుండా అప్పీలుకు వెళ్లిన తర్వాత స్పందిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులకు ఖర్చు, కాలయాపన తప్పడం లేదు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అప్పీలుకు వెళ్లాల్సి వస్తే సదరు అప్పిలేట్ అధికారి, దరఖాస్తుదారులతో ఆన్‌లైన్‌లోనే విచారణ జరిపి తక్షణం సమాచారం ఇచ్చేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

విద్యార్థులను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు: ఇద్దరికి గాయాలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో.. ఇద్దరు ఇంటర్ విద్యార్థులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మాదేపల్లికి చెందిన సాయిమహేశ్, మనోజ్ బాలబాలాజీ మంగళవారం ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి మానూరు వైపు వెళ్తున్నారు. మార్గం మధ్యలోని మహేశ్వరపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకూ గాయాలయ్యాయి.

కళాశాల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణమైన విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. సంఘ నాయకులు కె.నాని, సాయి మాట్లాడుతూ.. విద్యార్థి సీహెచ్ అచ్యుత్‌కు ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు ఇవ్వకుండా కరస్పాండెంట్ వేధిస్తున్నారని ఆరోపించారు. మనస్తాపానికి గురైన విద్యార్థి కొన్నాళ్ల కిందట కళాశాల ఎదుట ఆత్మహత్యకు యత్నించారని, అయినా, యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్వో పుష్పమణికి వినతి పత్రం అందజేశారు. బాధిత విద్యార్థి సోదరుడు ఎ.ప్రవీణ్, మేనత్త కె.సుహాసిని, విద్యార్థి సంఘాల నాయకులు బి.వినోద్, ఎం.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సేంద్రియ సాగు.. మాధుర్యం బాగు!

ఆయనకు బాల్యం నుంచి వ్యవసాయం మంటే అమితాసక్తి. ఓవైపు సేంద్రియ విధానంలో పంటలు పండిస్తూ... మరోవైపు తేనెటీగల పెంపకం.. ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇతర రైతులకూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు జంగారెడ్డిగూడేనికి చెందిన ముళ్లపూడి శ్రీనివాస్.

- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం పట్టణం

శ్రీనివాస్‌ది వ్యవసాయ కుటుంబం. పంగిడిగూడెంలో తనకున్న మూడెకరాల పొలంలో వరి, మొక్కజొన్నతో పాటు ఇతర అంతర పంటలు సాగు చేసేవారు. వర్షాభావం, గిట్టుబాటు ధరల లేమితో దీర్ఘకాలిక పంటలపై దృష్టి సారించారు. పదేళ్ల కిందట పొలంలో దేశవాళీ కొబ్బరి మొక్కలు తెప్పించి నాటించారు. వాటి మధ్య అంతర పంటగా కోకో మొక్కలు పెంచారు. సాగు లాభదాయకంగా మారడంతో... జంగారెడ్డిగూడెం శివారులో మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నారు. అందులోనూ కొబ్బరి, కోకోను సాగు చేస్తున్నారు. ఖర్చులన్నీ పోను ఏడాదికి ఎకరాకు రూ.2.70 లక్షలు ఆదాయం పొందుతున్నారు.

వినూత్న పంథాలో... వ్యవసాయంతో పాటు వినూత్నంగా ఏదైనా చేయాలని శ్రీనివాస్ భావించేవారు. ఆయిదేళ్ల క్రితం పెదవేగి మండలం విజయరాయిలోని కేవీకేలో తేనెటీగల సాగుపై వారం రోజుల శిక్షణ తీసుకున్నారు. శిక్షణానంతరం 5 తేనెటీగల పెట్టెలు, యూరోపియన్ తేనెటీగలు తీసుకొచ్చి... కోకో, కొబ్బరి తోటల్లో ప్రయోగాత్మకంగా పెంచారు. ప్రస్తుతం 150కు పైగా పెట్టెలుండగా నెలకు సుమారు 300 కిలోల తేనె ఉత్పత్తి చేస్తున్నారు.

సంప్రదాయ సస్యరక్షణ

శ్రీనివాస్‌కు మొదట్నుంచి సేంద్రియ వ్యవసాయమే బలం. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకానికి ఆయన దూరం. సంప్రదాయ సస్యరక్షణ చర్యలు పాటిస్తూ... సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు. పశువుల ఎరువు, జీవామృతం, కోకో చెట్ల నుంచి వచ్చే ఎండు ఆకుల తదితరాలను మొక్కల మొదళ్లలో వేస్తూ.. నీరందిస్తున్నారు. పొలంలో వర్షపునీరు నిల్వ ఉండేలా ఐదుకు గుంతలు తవ్వుతున్నారు. 'వ్యవసాయం అంటే చిన్నతనం నుంచే ఇష్టం. ఆ మక్కువతోనే ముందుకెళ్తున్నా. ఎకరాకు కోకో, కొబ్బరిపై ఖర్చులన్నీ పోను రూ.1.50 లక్షలు, తేనె విక్రయంపై ఏడాదికి రూ.1.20 లక్షలు ఆదాయం వస్తోందని' అని రైతు ముళ్లపూడి శ్రీనివాస్ తెలిపారు.



తేనెటీగల పెట్టెలు పరిశీలిస్తున్న రైతు శ్రీనివాస్

రైతేరాజు

దోమ ఆశిస్తే.. అప్రమత్తం కావాల్సిందే

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: వరి పంటను దోమ ఆశిస్తే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లేని పక్షంలో దిగుబడిపై ప్రభావం పడుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటను దోమ ఆశించిన నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలు, సస్యరక్షణ చర్యలు గురించి ఆయన వివరించారు. వరి దుబ్బుకు 20-25 దోమలు ఉన్నట్లయితే వెంటనే అప్రమత్తమై సస్యరక్షణ చర్యలకు వెళ్లాలి. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. డైనోలిఫ్యూరాన్ 0.4 గ్రాములు లేదంటే పైమెట్రోజిన్ 0.6 గ్రాములు లేదా ట్రైఫ్లూమీజోపైరిమ్ 0.48 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి ఏదైనా ఒక పురుగు మందును మొక్క మొదలు తడిచేటట్లుగా పిచికారీ చేయాలి. రెండోసారి పిచికారీ చేయాల్సి వచ్చినప్పుడు మొదట వాడిన మందులను కాకుండా మార్చి వాడాలి. ముఖ్యంగా దోమ ఉద్ధృతిని పెంచే పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదని సూచించారు.



పంటను ఆశించిన దోమ

మీరూ అడగొచ్చు

ప్రశ్న: సపోటాలో కాయ తొలుచు పురుగుని ఎలా అరికట్టాలి? - రామచంద్రరావు, దెందులూరు

సమాధానం: గుడ్లు నుంచి వెలువడిన గొంగళి పురుగులు కాయ లోపలికి తొలచి గుజ్జును తిని పురుగు విసర్జితాలతో రంధ్రం మూసి ఉంటుంది. పూర్తిగా పెరిగిన గొంగళి పురుగు కాయ నుంచి వెలువడి కోశస్థ దశను గడుపుతుంది. తర్వాత దశలో శిలీంద్రం ఆశించడం వల్ల కాయలు కుళ్లిపోతాయి. దీని నివారణకు వేప గింజలు కషాయం 5 శాతం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి లేత చిగురు, పూత దశలలో వారం రోజుల వ్యవధిలో మందులకు మార్చి మార్చి పిచికారీ చేయాలి.



డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ఇలా చేస్తే.. జామలో మంచి దిగుబడులే

పోడూరు, న్యూస్‌టుడే: జామ తోటల్లో సమగ్ర ఎరువుల, పోషకాల యాజమాన్యంతో నాణ్యమైన దిగుబడిని పొందవచ్చునని తణుకు ఉద్యానశాఖాధికారి ప్రియదర్శిని తెలిపారు. ఈ సాగులో ఎరువులు, పోషకాల యాజమాన్యంపై ఆమె పలు విషయాలు వివరించారు. ఏడాది వయసు కలిగిన జామ చెట్టుకు 200 గ్రాముల యూరియా, 250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 100 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. రెండు నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు 400 గ్రాముల యూరియా, 500 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 350 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నాలుగో సంవత్సరం నుంచి 850 గ్రాముల యూరియా, కేజీ సింగిల్ సూపర్ ఫాస్పేట్, 850 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. ఈ మోతాదులను ఏప్రిల్-జూన్ నెలలో 50 శాతం, అక్టోబర్ - నవంబరు నెలలో మరో 50 శాతం వేయాలి. వీటితోపాటు ఏటా కనీసం 10 నుంచి 15 కిలోల పశువుల ఎరువు, 2 నుంచి 5 కిలోల వేప పిండి తప్పనిసరిగా వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.



తాళం వేసిన ఇంట్లో చోరీ

ముసునూరు, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన ముసునూరు మండలం కొర్లగుంట పంచాయతీ సింహాద్రిపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామకూరి ప్రభావతి కుటుంబసభ్యులు ఈనెల 3న మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈనెల 7న తిరిగొచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, ఏఎస్సై నాగభూషణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. 90 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఎస్సై ఎం.చిరంజీవి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వల పట్టివేత

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.2.30 లక్షల విలువైన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఇంటి వద్దనే బాణసంచా నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

27న డ్రైవర్ల సంఘ ఎన్నికలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఎన్నికలను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి తెలిపారు. ఈ నెల 20న నామపత్రాల స్వీకరణ, పరిశీలన, అదే రోజు మధ్యాహ్నం నామపత్రాల ఉప సంహరణ ఉంటుందన్నారు. ఈ నెల 27న ఏలూరులోని సంఘ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహిస్తామని, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తీరం.. వ్యర్థాలమయం..!



పేరుపాలెం బీచ్‌లో సేకరించి వదిలేసిన చెత్త మూటలు

ఇటీవల వరుస తుపానులు, వరదలకు ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన కిక్కిస తదితర వ్యర్థాలన్నీ సముద్ర తీరంలో పేరుకుపోయాయి. ఏటిమొగ మొదలుకొని మోళ్లపర్రు బీచ్, పేరుపాలెం బీచ్, కేపీపాలెం, చినమైనవాని లంక తీరం వరకూ పలుచోట్ల పరిస్థితి ఇలాగే ఉంది. పేరుపాలెంలో కొన్నిచోట్ల వ్యర్థాలు వేసేందుకు సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసినా సందర్శకులు వాటిని వినియోగించడం లేదు. ఇటీవల గాంధీ జయంతి రోజున విద్యార్థులు సేకరించిన వ్యర్థాలను పాలిథిన్ కవర్లలో వేసి అక్కడే వదిలేశారు. అధికారులు వాటిని తొలగించి తీరంలో కూర్చునేందుకు బల్లలను, తాగు నీటిని ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

- ఈనాడు, నరసాపురం



ఏటిమొగ సమీపంలో ఇలా..



పేరుపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన కుండీలు

దేశమంతా భాజపా హవా

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: దేశమంతా భాజపా హవా కొనసాగుతోందని, హరియాణాలో మూడోసారి అధికారంలోకి రావడమే ఇందుకు నిదర్శనమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్ అన్నారు. హరియాణాలో భాజపా అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో... స్థానిక అశోకనగర్ జిల్లా కార్యాలయం ఎదుట మంగళవారం రాత్రి పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. పార్టీ ఏలూరు పార్లమెంటు కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు, నాయకులు ఆడపా సురేశ్, నాగం శివ, రాజశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కార్యాలయం ఎదుట సంబరాలు చేసుకుంటున్న నాయకులు

'ఇగ్నో' కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) దూరవిద్య, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు కేప రామరాజు తెలిపారు. డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు https:///ignouadmissions.samarth.edu.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

248 సర్వీసులు తనిఖీ.. రూ.9.68 లక్షల జరిమానా

విద్యుత్తు విజిలెన్స్ అధికారుల విస్తృత దాడులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు విజిలెన్స్ అధికారులు మంగళవారం ముదినేపల్లి మండలంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్.వాసు ఆధ్వర్యంలో 42 బృందాలు గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులకు సంబంధించిన సర్వీసు మీటర్లను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో గుడివాడ ఈఈ జి.బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామర్థ్యానికి మించి అదనపు లోడు వినియోగిస్తున్న 248 మంది వినియోగదారులకు రూ.9.68 లక్షలు జరిమానా విధించగా, విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరు వినియోగదారులకు రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. గుడివాడ గ్రామీణ ఏడీఈ పి.కిరణ్‌బాబు, పలువురు ఏడీఈ, ఏఈఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

అటవీ అభివృద్ధికి కృషి

జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అటవీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని భారత అటవీ సర్వే సంస్థ బెంగళూరు ఎఫ్ఆర్‌వో కేపీ సింగ్ అన్నారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి, బుట్టాయగూడెం మండలం దొరమామిడి అటవీ ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మట్టి నమూనాలు సేకరించి చెట్ల చుట్టు కొలత, పరిమాణాలపై సర్వే చేశారు. వ్యవసాయ భూముల్లో పెరిగేవి, అటవీ ప్రాంతంలో ఉండే వృక్షాల పెరుగుదలలో వ్యత్యాసాలపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అడవుల విస్తీర్ణం తగ్గకుండా మారుజాతి మొక్కలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్వే సంస్థ సాంకేతిక సహాయకుడు మనోహర్, ఎఫ్‌బీవో శ్రీమన్నారాయణ, సిబ్బంది రాముడు పాల్గొన్నారు.



ములగలంపల్లి బీటులో చెట్టు పరిమాణం పరిశీలిస్తున్న కేపీ సింగ్

డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉత్తీర్ణత సాధించి హార్టీ సెట్-2024 అర్హత పొందిన విద్యార్థులకు బీఎస్సీ (హార్టికల్చర్) కోర్సులో ప్రవేశాలకు స్థానిక వర్సిటీ పరిపాలన భవనంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 91 సీట్లు అందుబాటులో ఉన్నాయని, హార్టీ సెట్-2024లో 255 మంది అర్హత పొందగా కౌన్సెలింగ్‌కి 169 మంది హాజరైనట్లు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

గంజాయి రాకెట్ గుట్టురట్టు

ఆరుగురి అరెస్ట్, 11 మందిపై కేసు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: పోలీసులు గంజాయి రాకెట్ గుట్టురట్టు చేశారు. కల్లూరు ఏసీపీ ఎ.రఘు కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సత్తుపల్లి ఠాణాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఖమ్మం జిల్లా కిష్టారానికి చెందిన పాశెం వెంకటశివరామకృష్ణ అలియాస్ పండు, కువ్వారపు నితిన్‌కుమార్, రామాల కార్తీక్, పాలకుర్తి రాజేశ్‌లతోపాటు సత్తుపల్లిలోని ద్వారకాపురికాలనీకి చెందిన కొమ్ము మనోవర్ధన్ అలియాస్ మను, ఏపీలోని ఏలూరు జిల్లా జనార్దనవరానికి చెందిన కొత్తపల్లి రత్నబాబులు నాలుగు కిలోల గంజాయిని కారు, రెండు ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా సత్తుపల్లికి తరలిస్తుండగా మేడిశెట్టివారిపాలెం అడ్డరోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పాశెం వెంకటశివరామకృష్ణ సత్తుపల్లిలోని ఎండీ ఆసుపత్రి రోడ్డులో ఉంటున్న ఆరుమళ్ల తరుణ్‌కుమార్, వేల్పుల పుల్లారావు, మనోవర్ధన్‌తో కలిసి ఇటీవల ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరంలో ఓ ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. దీంతోపాటు మరో బైక్ సాయంతో ఒడిశా రాష్ట్రంలోని ఆవులపాకకు చెందిన భగవాన్ దగ్గరకు వెళ్లి మూడు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. కొంత వినియోగించుకుని మిగిలిన దాన్ని చిన్న పొట్లాలుగా చేసి రూ.500చొప్పున విక్రయించారు. అందులో అర కిలో గంజాయిని సత్తుపల్లిలోని వెలిశాల వినయ్, తాళ్లమడకు చెందిన నున్నా నవీన్‌లకు అమ్మినట్లు వెంకటశివరామకృష్ణ చెప్పడంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పది రోజుల క్రితం ఒడిశా నుంచి గంజాయిని తీసుకొస్తూ పోలీస్ తనిఖీల దృష్ట్యా భద్రాచలంలో దాచారు. అనంతరం సత్తుపల్లికి తరలిస్తూ సోమవారం పట్టుబడటంతో విషయం వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన వ్యక్తులు ఇప్పటివరకు 82 మందికి విక్రయించినట్లు విచారణలో తేలిందని ఏసీపీ వివరించారు. 11మందిని కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించిందని తెలిపారు. మొత్తం రూ.1,46,125 విలువైన 5.845 కిలోల గంజాయిని సీజ్ చేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఏసీపీ ఎ.రఘు, సీఐ కిరణ్, సిబ్బంది

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry ★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పై॥ తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు



ప్రధాని మోదీకి జ్ఞాపిక ఇస్తున్న మహేశ్ కుమార్

ప్రధాన మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకుగాను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు దిల్లీలో ప్రధానిని కలిసి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేశారు. పోలవరానికి రూ.2,800 కోట్ల నిధులు మంజూరు చేయడంతో త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణం మరింత ఊపందుకునేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు.

నేడు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. నగరపాలక సంస్థలో ముగ్గురు కో-ఆప్షన్ సభ్యుల పదవులు ఖాళీ కాగా, వాటిని భర్తీ చేయనున్నారు. ఈ పదవులకు తెదేపా అభ్యర్థులు కోలేటి రాజు, పోడే వెంకటరత్నం, జాలా సుమతి జబీవల నామపత్రాలు సమర్పించారు. వైకాపా నుంచి ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో... వీరి ఎన్నిక దాదాపు ఖరారైంది. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులంతా విధిగా హాజరుకావాలని అదనపు కమిషనర్ చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: సత్రంపాడు ఎమ్మార్సీ కాలనీలో రామాలయం రోడ్డులో పది రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. **- టి.నాగరాజు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: ఆముదాల అప్పలస్వామి కాలనీ గాంధీ పార్కు రోడ్డులోని మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. ఫలితంగా దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంటోంది. **- సీహెచ్ బాలఏసు, స్థానికుడు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక అదనపు అధికారి**

సమస్య: విద్యానగర్ పిండిమర రోడ్డులోని కాలువలో మురుగు పేరుకుపోయింది. రోజుల తరబడి వ్యర్థాలు నిండిపోవడంతో దుర్గంధం వస్తోంది. **- ఆర్.మల్లేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయిస్తాం. దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

నిబంధనలు అతిక్రమించి.. వ్యాపారాలు సాగించి!

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కొందరు దుకాణదారులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

అంతా మా ఇష్టం.. అడిగేదెవ్వరు? అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు కొందరు వ్యాపారులు. నగరంలోని జడ్పీ కార్యాలయ స్థలంలో ప్రభుత్వం భవన సముదాయం నిర్మించింది. వాటిని వ్యాపారులకు అద్దెకిచ్చారు. కొందరు దుకాణదారులకు జడ్పీ అధికారులకు నెలవారీ అద్దె సక్రమంగా చెల్లించడం లేదు. పైగా నిబంధనలు అతిక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. దుకాణ సముదాయం ఎదురుగా ఉన్న మురుగు కాలువలు పూర్తిగా ఆక్రమించేశారు. ఇక్కడ ఓ వ్యాపార దుకాణానికి(బిర్యానీ విక్రయ కేంద్రం) వెనుక భాగంలోని జడ్పీ కార్యాలయ స్థలంలో వంట గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటి నుంచి దుకాణం లోపలికి గోడ నుంచి రంధ్రాలు పెట్టి గొట్టాలు అమర్చారు.



జడ్పీ కార్యాలయ ఆవరణలో గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేసుకున్న దుకాణదారు

ప్రమాదకరంగా సిలిండర్లు

తమ సమస్యల పరిష్కారానికి రోజూ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు జిల్లా పరిషత్తు కార్యాలయానికి వస్తుంటారు. వారంతా అక్కడి చెట్ల కింద కాసేపు సేదదీరుతుంటారు. వారిలో కొందరు సిగరెట్టు కాల్చి అక్కడే వదిలేస్తున్నారు. చెట్ల కింద ఎండిన చెత్తను సిబ్బంది అక్కడే దహనం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల మధ్య, ఆరుబయట గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగిస్తున్నా... ఎవరూ కనీసం పెదవి విప్పడం లేదు. వ్యాపార దుకాణానికి సమీపంలోనే అగ్నిమాపక కార్యాలయం ఉంది. అయితే అటు జడ్పీ కార్యాలయ అధికారులు కానీ, ఇటు అగ్నిమాపక సిబ్బంది కానీ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన గ్యాస్ సిలిండర్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెదవేగి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రాయన్నపాలెంలో రూ. 2.90 లక్షలతో నిర్మించనున్న గోకులం షెడ్డు నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నూరు శాతం రాయితీనిస్తోందన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో పి. శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి ముత్యాల ప్రియాంక, తెదేపా మండలాధ్యక్షుడు బొప్పన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా అక్రమ సాగును అడ్డుకోవాలి

కాకర్లమూడి(ఉంగుటూరు), న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా ఆక్వా సాగు చేస్తున్నారని కాకర్లమూడిలో వరి చేలు నీట మునిగి రైతులు నష్టపోయారని సర్పంచి కాళ్ల నాగవెంకట సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ... ఇదే విషయమై సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. గ్రామానికి చెందిన ఒకరు పొలాల్లో నాయకుల అండదండలతో అనుమతుల్లేకుండా ఆక్వా సాగు చేపట్టారన్నారు. రొయ్యల సాగుతో వర్షాకాలంలో వరి చేలు మునిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వరద బాధితులకు విరాళం..

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సర్పంచి కాళ్ల నాగ వెంకట సత్యనారాయణ, గ్రామస్థులు రూ. 50 వేలు సీఎం సహాయ నిధికి విరాళమిచ్చారు. కాగుపాడులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు మంగళవారం నగదు అందజేశారు.

పారదర్శకంగా దుకాణాల కేటాయింపు

కైకలూరు, న్యూస్‌టుడే: దరఖాస్తుల అనంతరం లాటరీ విధానంలో మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నూతన మద్యం దుకాణాలకు జరుగుతున్న దరఖాస్తుల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు.

మద్యం దుకాణాలకు 2,712 దరఖాస్తులు

గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న డిమాండ్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో 114 మద్యం దుకాణాలకు మంగళవారం నాటికి 2,712 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 9 వరకు మాత్రమే తుది గడువు ఉండటంతో... నమోదు ప్రక్రియ ఊపందుకుంది. సోమవారం నాటికి 1,295 నమోదు కాగా, మంగళవారం ఒక్కరోజే 1417 దరఖాస్తులందాయి. బుధవారం ఆఖరి రోజు కావడంతో మరో 1000 నుంచి 1500 వరకు దరఖాస్తులొచ్చే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోని తక్కువగా, గ్రామాల్లోని దుకాణాలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. పట్టణాల్లో అధికంగా దుకాణాలుండటం, అద్దెలూ పెద్ద మొత్తంలో చెల్లించాల్సి రావడం, గొలుసు దుకాణాలకు వీల్లేకపోవడంతో డిమాండ్ తగ్గిందని పలువురు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ దుకాణాలుండటం, అద్దెలూ నామమాత్రంగానే ఉండటంతో పాటు గొలుసు దుకాణాలు పెట్టుకునే అవకాశాలు ఉన్నందున వాటికే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. పట్టణాల్లో దుకాణాల ఏర్పాటుకు ఇప్పటికే కొందరు సిండికేటుగా ఏర్పడ్డారని... ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గతంలో చక్రం తిప్పినవారంతా కలిసి ఓ అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా పెద్దగా పోటీ లేకుండా సవ్యంగా సాగేలా వ్యవహారం నడుపుతున్నారని సమాచారం.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా వర్మ

దెందులూరు, న్యూస్‌టుడే: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా చింతమనేని వర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఈగా పని చేసిన రాజేంద్రప్రసాద్ బదిలీపై ద్వారకాతిరుమల వెళ్లారు. అలాగే దెందులూరు మండల వ్యవసాయాధికారిగా దామా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కొవ్వలి వ్యవసాయ క్షేత్రం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికొచ్చారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: అల్ప(లో వోల్టేజీ) విద్యుత్తు సమస్యను పరిష్కరించి, వినియోగదారులకు నాణ్యమైన సరఫరా చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్తు శాఖాధికారులతో మంగళవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సరిపల్లిలో 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి మరో ఎకరా భూమి సేకరించి త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. విద్యుత్తు శాఖాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయంతో పని చేసి విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. స్థానికులు, ఎన్డీయే నాయకులు విద్యుత్తు సమస్యలపై ఏకరవు పెట్టారు. నారాయణపురం, గొల్లగూడెం ఉప కేంద్రాల్లోని విద్యుత్తు నియంత్రికల సామర్థ్యం పెంచాలని ఐస్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు వినతిపత్రం అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకుడు వట్టి పవన్‌కుమార్, ఈఈలు నరసింహారావు, అంబేడ్కర్, ఏడీఏలు బి.రామకృష్ణ, గోపాలకృష్ణ, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కింది వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి, డైరెక్టర్ పాండురంగారావు

నీటి ఊట సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక ఒకటి, రెండో పట్టణాలను కలుపుతూ గతంలో ఏర్పాటు చేసిన కింది వంతెనలో ఊట నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ఆచార్య పాండురంగారావుతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే వంతెనను పరిశీలించారు. పాండురంగారావుతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చంటి మాట్లాడుతూ.. ప్రజలు రాకపోకలు సాగించేందుకు కింది వంతెనను నిర్మించారన్నారు. ఎప్పటికప్పుడు నీరు ఊరటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. 2017లో పాండురంగారావు ఆధ్వర్యాన నిపుణుల బృందం పరిశీలించిందని, వారిచ్చిన రిపోర్టును పరిశీలించామన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి మరోమారు పాండురంగారావును తీసుకొచ్చామన్నారు. వరంగల్ నిట్, నీటి వనరుల ఇంజినీర్లు త్వరలోనే ఏలూరొచ్చి అతి తక్కువ కాల వ్యవధిలో సమస్య పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్ చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి: ఎమ్మెల్యే

కాగుపాడు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వంద శాతం మౌలిక వసతుల కల్పనకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్, కడియాల రంగారావు, జాస్తి నాగేశ్వరరావు రూ.3 లక్షల సొంత నిధులతో కాగుపాడులో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఆధునికీకరించారు. ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి కొరపాటి ఆంజనేయులు, శ్రీలక్ష్మి దంపతుల పేరిట వారి కుమారుడు సూర్యచంద్ర సుబ్రహ్మణ్యరాజు రూ. 1.50 లక్షలతో షెడ్డు నిర్మించారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ. 30 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ దేవత గుల్లాలమ్మ ఆలయానికి వెళ్లేందుకు ఉపాధిహామీ నిధులు రూ. 10 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచి కడియాల సుదేష్ణ, ఎంపీడీవో రాజ్‌మనోజ్, నాయకులు పాల్గొన్నారు.



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ధర్మరాజు



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

అంజనీసుతునికి ప్రత్యేకాభిషేకాలు


పెదపాడు, న్యూస్‌టుడే: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అంజనీసుతుని దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుదీరారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేశారు. నూజివీడుకు చెందిన బూరుగుపల్లి నాగహనుమాన్ సూర్యతేజ, తేజస్వి దంపతులు ఆర్థికసాయంతో ఆలయ సత్రంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న 15 మందిని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో అరెస్టు చేశామని ఎస్పీ గంగాధరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదపారుపూడి హిందూ శ్మశానవాటిక వద్ద కొంత మంది గంజాయి పీలుస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో వెళ్లి 15 మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 8 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకున్నారన్నారు. మరొకరు రెండు కిలోల గంజాయితో పరారవ్వగా అతని కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయన్నారు. నిందితులందరూ గుడివాడ, ఏలూరు, భీమవరం ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. వారిని విచారించగా అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరుకు వెళ్లి 10 కిలోల గంజాయి కొనుగోలు చేసి తెచ్చినట్లు అంగీకరించారన్నారు. నిందితుల్లో కొంతమంది పాత నేరస్థులున్నట్లు తెలిపారు. గుడివాడ చెంచుపేట కాలనీకి చెందిన కుంచం ఆశీర్వాదం ఓ కేసులో బందరు జైలులో ఉన్నపుడు ఏలూరుకు చెందిన ఏసీ మెకానిక్ శక్తి జశ్వంత్, కొల్లూరి శ్రీనివాస్, భీమవరానికి చెందిన ఫణీంద్రతో పరిచయం ఏర్పడింది. విలాసాలు, చెడు వ్యసనాలకు బానిసలైన వారంతా కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నట్లు తేలిందని ఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. పామర్రు సీఐ శుభాకర్, ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక మెలకువలు అవసరం

పెదవేగి, పెదపాడు, న్యూస్‌టుడే: సాగులో రైతులకు సాంకేతిక మెలకువలు నేర్పేందుకు ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రాయన్నపాలెంలో మండల వ్యవసాయాధికారి ముత్యాల ప్రియాంక ఆధ్వర్యాన మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ★ వసంతవాడ, గోగుంట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యాన 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.











ఏలూరు: కనకదుర్గమ్మ

మహాలక్ష్మీదేవిగా.

లలితాదేవి అలంకరణ

భీమడోలు: రూ.10 లక్షలతో..

భీమడోలు: కనకదుర్గాదేవి



ఉంగుటూరు: 12.50 లక్షల కరెన్సీతో..

జనయిత్రి.. జగధాత్రి

దేవీ నమస్తుభ్యం.. దేవీ పాహిమాం.. అంటూ మహిళలు అమ్మవార్లకు ప్రణమిల్లారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆరో రోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఏలూరు సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి, దొండపాడులోని శ్రీనం దత్తనాథ క్షేత్రం, సత్యనారాయణపేటలోని గంగాపార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామి, మాదేపల్లిరోడ్డులోని సుంకరవారితోట వంతెన వద్దనున్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అగ్రహారంలోని జ్ఞానసరస్వతి అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. కొత్తపేటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సుహాసిని పూజ నిర్వహించారు. పెదపాడు, పెదవేగి మండలాల్లోని రాట్నాలమ్మ, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు చేశారు. భీమడోలు మండలం పూళ్లలో భవానమ్మను రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులోని కనకదుర్గమ్మను సర్పంచి రాందే లక్ష్మీ సునీత, రాజారావు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి రూ. 12.50 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా తీర్చిదిద్దారు. ఉంగుటూరు చల్లాలమ్మ కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకుడు వట్టి పవన్‌కుమార్ అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**



ఏలూరు: పాద పూజ చేయించుకున్న మహిళలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని ఓ పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ... పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, వేధింపులు ఆపాలని కోరారు. పరిశ్రమ కార్మికులు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు. నాయకలు వీవీఎన్ ప్రసాద్, బి.జగన్నాథరావు, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేతి సంచిలో పర్సు మాయం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళ చేతి సంచిలో పర్సు మాయమైన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడుకు చెందిన అల్లాడ లక్ష్మి లింగపాలెం మండలం మఠంగూడెంలో జీవిస్తున్న కుమార్తె ఇంటికి వెళ్లేందుకు ఏలూరు వచ్చారు. కొత్త బస్టాండ్‌లో మఠంగూడెం వెళ్లేందుకు చింతలపూడి బస్సెక్కారు. బసు రద్దీగా ఉండటంతో దొంగలు ఆమె చేతి సంచిలోని పర్సును కాజేశారు. అందులోని రూ.72 వేలు నగదు, 2 గ్రాముల బంగారు ఆభరణాలున్నాయని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చీర కొంగుకు దీపం మంట అంటుకోవడంతో... తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... సత్రంపాడు విద్యుత్‌నగర్‌కు చెందిన బేబీ సరోజిని(80) ఈ నెల 7న ఇంట్లో దీపారాధన చేస్తున్నారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు మంట చీర కొంగుకు అంటుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆసుపత్రి భద్రతా సిబ్బందిపై దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఓ ప్రైవేటు ఆసుపత్రి భద్రతా సిబ్బందిపై దాడి చేసి కుర్చీలు ధ్వంసం చేసిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక వీవీ నగర్‌కు చెందిన దర్శనపు ప్రశాంత్, ఏపూరి నాని సోమవారం రాత్రి పూటుగా మద్యం తాగి ఆర్‌ఆర్‌పేటలో తిరుగుతూ ఓ ఆసుపత్రి వద్ద ఆగారు. అక్కడి భద్రతా సిబ్బందితో అకారణంగా గొడవ పడి దాడి చేశారు. కుర్చీలు సైతం ధ్వంసం చేశారు. ఆసుపత్రి సూపర్‌వైజర్ గంగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం రాత్రి వారిపై కేసు నమోదు చేశారు.

గ్రామ పాలనలో భాగస్వాములు కండి

పెదవేగి, పెదపాడు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల పాలనలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో పి.శ్రీనివాస్ సూచించారు. పెదవేగి మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం వార్డు సభ్యులు, ఉప సర్పంచుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈవోపీఆర్డీ షరీఫ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ★ పెదపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణను ఎంపీడీవో జమీల్‌జమ ప్రారంభించి మాట్లాడారు. ఈవోపీఆర్‌డీ సూర్యకుమార్ అధ్యక్షత వహించారు.

దెందులూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీవో కె.శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల రెండ్రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.

భీమడోలు: గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు పెంచుకునే స్థాయికి ఎదగాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ తరగతులను ప్రారంభించారు.

గణపవరం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ దండు రాము, ఎంపీడీవో జేబీ శ్రీలక్ష్మి శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఈవోపీఆర్డీ పీవీ సత్యనారాయణ, ఎంవోటీ డి.రామాంజనేయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, చేబ్రోలు కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెదవేగి: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

కోళ్ల వ్యర్థాల రవాణా.. లారీ స్వాధీనం..

పెదపాడు, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న లారీని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్.సతీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు... విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని వివిధ గ్రామాల్లో చేపల చెరువులకు మేతగా వినియోగించేందుకు తరలిస్తున్నారు. మార్గం మధ్యలోని రామచంద్రపురం వద్ద పోలీసులు లారీని పట్టుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్లపై కేసులు నమోదు చేశారు. ఎవరైనా కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఏలూరు సినిమా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	కాళి
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	సత్యంసుందరం
సత్యనారాయణ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	ఉత్సవం
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సెలబ్రెటీ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	--------
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	శ్వాగ్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	దేవర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	ఏఆర్‌ఎం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	మత్తు వదలరా 2



దెబ్బతిన్న ఆట పరికరాలు

ఉద్యానం.. అధ్వానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అనేక రకాల పనుల ఒత్తిడితో ఉదయం నుంచి సాయంత్రం వరకు సతమతమయ్యే పెద్దల నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చే చిన్నారుల వరకు కాస్తంత సేద తీరేందుకు అందుబాటులో ఉన్నవి ఉద్యానవనాలు. ఏలూరు నగరంలో వీటి నిర్వహణ సరిగా లేక అక్కడికి వెళ్లేవారికి నిరాశ ఎదురవుతోంది. స్థానిక ఆర్‌ఆర్ పేటలోని ఉద్యానవనమే ఇందుకు ప్రధాన సాక్ష్యం. ఇందులో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు పాడైపోయాయి. కొన్ని బాగా తుప్పు పట్టి ఉన్నాయి. దసరా సెలవుల సందర్భంగా బంధువుల ఇళ్లకు వచ్చి సాయంత్రం పూట ఉద్యానవనాలకు వెళ్లి ఎంచక్కా ఆటలాడుకుందామని వచ్చిన బాలల ఆనందం కాస్తా ఆవిరవుతోంది. ఉద్యానవనంలో పిచ్చి మొక్కలు బాగా పెరిగాయి. వాటిని తొలగించకపోవడంతో ఆహ్లాదం కొరవడింది. దీనిపై నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్ మాట్లాడుతూ ఉద్యానవనంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని అన్నారు.



పాడైన జారుడుబల్లపై ఆడుకుంటున్న బాలలు

పోలవరం
•పోలవరం • చింతలపూడి

భూముల పరిశీలన



జేసీ ధాత్రిరెడ్డికి వివరాలు వెల్లడిస్తున్న ఏఈ ఖాజా

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలం పట్టిసీమ-చింతలపూడి గ్రామాల మధ్య జాతీయ రహదారి 365బీబీ విస్తరణ పనులకు సంబంధించి రైతుల నుంచి సేకరించే భూములను జిల్లా సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. అంతకు ముందు పట్టిసీమ సచివాలయంలో సంబంధిత భూముల ధర విషయమై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న బేసిక్ విలువపై రెండున్నర రెట్లు అదనంగా పరిహారం ఇస్తామని చెప్పారు. దీనిపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాతీయ రహదారి వెళ్లే మార్గంలోని భూములను జేసీకి చూపించారు. ఆమె వెంట తహసీల్దార్ సాయిరాజు, ఎన్‌హెచ్ ఏఈ ఖాజా, వీఆర్వోలు వెంకటేశ్వరరావు, వినయకుమార్, బాబూరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న గోపీమూర్తి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బుర్రా గోపీమూర్తి అన్నారు. కొయ్యలగూడెంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారన్నారు. అటువంటి అనుభవాలు పునరావృతం కాకుండా హక్కుల సాధనకు సమష్టి కృషి అవసరమన్నారు. శాసనమండలిలో వాణి వినిపించడం ద్వారా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అనేక విజయాలు సాధించారన్నారు. ఉపాధ్యాయ ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముస్తఫా అలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఆకుమర్తి విక్టర్‌బాబు, సరంగుల రమేశ్, ఎంవీ శ్యాంబాబు, రాయపూడి వెంకటరమణ, కరుటూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి మంగళవారం జంగారెడ్డిగూడెం మండలంలో పర్యటించారు. పలువురు ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలును గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల విరగ్గొట్టిన విషయం విదితమే. జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర సొంత నిధులు వెచ్చించి విగ్రహం ప్రాంతంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో పట్టణ దళిత, గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డీఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

పల్లె దారులకు మహర్దశ!

ఉపాధి నిధులతో అభివృద్ధికి అడుగులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లెదారులకు మోక్షం కలిగింది. అయిదేళ్లుగా గ్రామాల్లో చాలాచోట్ల మట్టిబాటలే నేటికీ వీధులు సిమెంటు రోడ్లుగా మారనున్నాయి. అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టిన కూటమి ప్రభుత్వం గత ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల ద్వారా ఆయా పనుల వివరాలు సేకరించింది. ఇప్పటికే కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలాల్లో 193 పనులకు అనుమతి మంజూరు కాగా ఉపాధి నిధులు రూ.20 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. దీనికి అదనంగా పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో మరో 54 పనులకు అనుమతి లభించింది. ఆ పనుల నిర్వహణకు ఉపాధి నిధులు రూ.357.95 లక్షలు కేటాయించారు. పోలవరం నియోజకవర్గంలో 51 పనులకు రూ.233.75 లక్షలు, చింతలపూడిలో 6 పనులకు రూ.139.20 లక్షలు కేటాయించారు. వీటితో కొయ్యలగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతో పాటు చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. మొత్తంగా పరిశీలిస్తే.. 247పనులకు రూ.2357.95 లక్షలు నిధులు కేటాయించడం విశేషం. ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండగ వారోత్సవాల సందర్భంగా పనులను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



బయ్యనగూడెంలో సీసీరోడ్డు అభివృద్ధి చేయనున్న రహదారి

మండలం	మొత్తం పనులు	మంజూరైన నిధులు (రూ.లక్షలు)
పోలవరం నియోజకవర్గంలో..		
కొయ్యలగూడెం	84	637.00
పోలవరం	07	26.75
కుక్కునూరు	29	145.00
వేలేరుపాడు	02	10.00
జీలుగుమిల్లి	42	600.00
బుట్టాయగూడెం	48	300.00
టి.నరసాపురం	29	500.00
చింతలపూడి నియోజకవర్గంలో..		
చింతలపూడి	01	40.00
కామవరపుకోట	03	49.20
లింగపాలెం	02	50.00

మద్ది ఆంజనేయునికి విశేష పూజలు



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది ఆంజనేయస్వామిని దర్శించేందుకు మంగళవారం భక్తులు వెల్లువెత్తారు. ఆలయంలో 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. స్వామివారికి తమలపాకులతో విశేష పూజలు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పూజా టికెట్లు, విరాళాల రూపంలో రూ.1.96 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం : 80085 74947
చింతలపూడి : 76759 19086

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే

సమస్య: బుట్టాయగూడెం కొత్తపేటలో ప్రధాన రహదారిపై భారీ గోతులు పడ్డాయి. చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. **-స్థానికులు**

సమాధానం: రూ.6 లక్షల అంచనాతో ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రహదారి మంజూరైంది. త్వరలో పనులు చేపడతాం. **-రామానుజం, పంచాయతీరాజ్ ఏఈ, బుట్టాయగూడెం**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి మండలం యర్రంపల్లి ప్రధాన రహదారిపై వంతెన ఇరుకుగా మారింది. ఎదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. **-సుధీర్‌కుమార్, స్థానికుడు**

సమాధానం: సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం. **-మురళీకృష్ణ, ఎంపీడీవో**

పండగలా నిర్వహించాలి



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రోషన్‌కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' పేరుతో ఈ నెల 14 నుంచి గ్రామగ్రామాన చేపట్టే సీసీ రహదారులు, మురుగు కాలువల కార్యక్రమాలను పండగలా నిర్వహించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పంచాయతీరాజ్ అధికారులతో స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రహదారులు, కాలువల పనుల తీర్మానాలను ఒకే ఒక్క రోజులో పూర్తి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయా పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ● ఇటీవల జరిగిన అంతర్ జిల్లా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన గోల్కొండ నీలిమను ఎమ్మెల్యే అభినందించారు.

అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలి.. లింగపాలెం, న్యూస్‌టుడే: రోగులతో దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హెచ్చరించారు. లింగపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు చెన్ను శ్రీను, అసిలేటి అజయ్ తదితరులు ఉన్నారు.

పొలం వివాదంపై విచారణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నకిలీ పత్రాలతో పొలం కాజేయాలని చూస్తున్నారు. న్యాయం చేయమంటూ 'మీ కోసం' కార్యక్రమంలో సోమవారం అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కె.చల్లన్నదొర మంగళవారం విచారణ చేపట్టారు. బాధితుల స్వగ్రామం రాజవరం వెళ్లి క్షేత్ర స్థాయిలో ప్రాథమిక సమాచారం సేకరించారు. స్థానిక వీఆర్వో, సర్వేయరు తదితర రెవెన్యూ ఉద్యోగులను వెంటబెట్టుకుని ఫిర్యాదులో పేర్కొన్న భూమిని పరిశీలించారు. మరోపర్యాయం ఈ నెల 10న విచారణ చేయనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ మణిదివ్య తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ప్రాధాన్యం



గంగానమ్మను దర్శించుకుంటున్న శ్రీనివాసులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతాల్లోని గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని ట్రైకార్ రాష్ట్ర ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. బుట్టాయగూడెంలో మంగళవారం గంగానమ్మను దర్శించుకున్న అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు ఉన్నాయో లేదో కూడా తెలిసేది కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో కేంద్రం నుంచి నిధులు సాధించి, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో గిరిజనులకు మేలు చేస్తామన్నారు. నాయకులు నల్లూరి కృష్ణమోహన్, మాటూరి ముసలయ్య, వరకా కృష్ణంరాజు, కుంజా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు బయ్యనగూడెం శ్రీచక్రసహితకనకదుర్గ అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. బొరగం వెంట పోలవరం ఏఎంసీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, భాజపా నాయకుడు బాలం నరేశ్, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక



కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని కేఆర్‌పురంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సున్నం శ్రీరాములు, ఉపాధ్యక్షురాలిగా తెల్లం పోశమ్మ, ప్రధాన కార్యదర్శిగా వెట్టి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా సరియం శ్రీను, సంయుక్త కార్యదర్శిగా కోటం సువర్ణ, సలహాదారురాలుగా కుర్సం గంగాదేవి, 19 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జోగారావు, వెంకటేశ్వరరావు వీరితో ప్రమాణస్వీకారం చేయించారు.

గ్రామ పరిపాలనపై శిక్షణ



కొయ్యలగూడెం: అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మహాత్ముడి ఆశయ సాధన దిశగా గ్రామ పరిపాలనపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీపీ గంజిమాల రామారావు సూచించారు. కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు ఏర్పాటైన శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. పంచాయతీ పాలనకు సంబంధించి ముఖ్యమైన పది అంశాలపై రెండ్రోజుల పాటు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక-2024-25 రూపకల్పనలో భాగంగా బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్‌గా రెడ్డిగణపవరం పంచాయతీ కార్యదర్శి కిరణ్ వ్యవహరించారు. ఎంపీడీవో కుంజా జ్యోతి పాల్గొన్నారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో కె.వాణి తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ ఎస్.వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం'



ప్రసంగిస్తున్న ఎలీజా

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. చింతలపూడి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ బలం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసంజీవరెడ్డి, సత్యేంద్రకుమార్, రామ్మోహన్‌రావు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



లక్ష్మీదేవి కుటుంబ సభ్యులకు డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న వైద్యురాలు దొరసానమ్మ

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం మల్లాయిగూడెం సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తగా పని చేస్తూ అకాల మరణం పొందిన మోలుగుమతి లక్ష్మీదేవి కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థిక సాయం చేసినట్లు రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కిరణ్‌చైతన్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మృతురాలి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన రాఘవాపురం, యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు రూ.1.30 లక్షలు సేకరించినట్లు చెప్పారు. ఆ నగదును లక్ష్మీదేవి ఇద్దరు ఆడపిల్లల పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేసి ఆయా పత్రాలను రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దొరసానమ్మ ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీ డ్రా విజేతకు బహుమతుల అందజేత



బేబీకి బహుమతి ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ఎల్జీ సంస్థ నిర్వహించిన ఇండియాకా సెలబ్రేషన్స్ లక్కీ డ్రా విజేత బుట్టాయగూడెం మండలానికి చెందిన జోడే బేబీకి ఆ సంస్థ రీజనల్ బిజినెస్ హెడ్ వెంకట కృష్ణాజీ, బ్రాంచి మేనేజరు పి.కిశోర్‌బాబు సోమవారం బహుమతులు అందజేశారు. జోడే బేబీ జంగారెడ్డిగూడెంలోని శ్యామ్ రాజ్‌కో హోమ్ నీడ్స్, ఫర్నీచర్ షోరూమ్‌లో ఇటీవల ఎల్జీ ఫ్రంట్‌లోడ్ వాషింగ్ మెషిన్ కొనుగోలు చేశారు. లక్కీ డ్రాలో విజేతగా ఎంపిక కావడంతో ఆమెకు ఆ సంస్థ రూ.లక్షలు విలువైన ఆరు రకాల వస్తువులను సోమవారం అందజేసింది. కార్యక్రమంలో కర్పూరం పార్థ వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చేతి సంచిలో పర్సు మాయం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళ చేతి సంచిలో పర్సు మాయమైన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడుకు చెందిన అల్లాడ లక్ష్మి లింగపాలెం మండలం మఠంగూడెంలో జీవిస్తున్న కుమార్తె ఇంటికి వెళ్లేందుకు ఏలూరు వచ్చారు. కొత్త బస్టాండ్‌లో మఠంగూడెం వెళ్లేందుకు చింతలపూడి బస్సెక్కారు. బసు రద్దీగా ఉండటంతో దొంగలు ఆమె చేతి సంచిలోని పర్సును కాజేశారు. అందులోని రూ.72 వేలు నగదు, 2 గ్రాముల బంగారు ఆభరణాలున్నాయని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విస్తరణాధికారిగా బాధ్యతల స్వీకరణ

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండల పరిషత్తు విస్తరణాధికారిగా బి.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెదవేగి మండల పరిషత్తులో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విస్తరణాధికారిగా పనిచేసిన రాంప్రసాదు పాలకోడేరుకు బదిలీ అయ్యారు.


సిరుల వేణి.. శరణు.. శరణు..

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవార్లు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం ఉద్యానవనంలోని అమ్మవారిని రూ.8.55 లక్షలతో అలంకరించారు.

–న్యూస్‌టుడే, బృందం



జంగారెడ్డిగూడెం: కన్యకాపరమేశ్వరికి నోట్లతో అలంకరణ



యర్రంపేట అంకాలమ్మ ఆలయం వద్ద కుంకుమార్చన



పట్టిసీమలో..



ముత్యాలమ్మ ..



ఉన్నత పాఠశాల పక్కన



కనకదుర్గమ్మ



ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ



వేలేరుపాడులో..



బయ్యనగూడెంలో ..

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

ఈనాడు కథనానికి స్పందన



కాలనీ వాసులతో మాట్లాడుతున్న అధికారులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. ఈ నెల 6న 'నిర్వాసితుల.. వైద్యం గాల్లో దీపం!' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెం నిర్వాసిత కాలనీని ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సురేశ్‌తో పాటు తహసీల్దార్ పర్యటించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ.. కాలనీలోని పీహెచ్‌సీ వైద్యుడు రెండ్రోజుల్లో విధుల్లో చేరతారని తెలిపారు. అలాగే మౌలిక వసతులు కల్పించడంతో పాటు తగిన సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు.

'జమిలి ఎన్నికలు భాజపా కుట్ర'



మాట్లాడుతున్న వనజ

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: దేశంలో నియంతృత్వ పాలన కోసం జమిలి ఎన్నికల పేరుతో భాజపా కుట్ర చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. చింతలపూడిలో సీపీఐ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో గెలుపొందిన వారు అయిదేళ్లు పాలించే అధికారం ఉందని, అందుకు విరుద్ధంగా భాజపా ప్రవర్తిస్తోందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు గురవయ్య, వసంతరావు, బాబు, సోమశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై అవగాహన అవసరం



వరి పైరును పరిశీలిస్తున్న హబ్ మేనేజరు సోమశేఖర్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయశాఖ కొయ్యలగూడెం హబ్ మేనేజరు బి.సోమశేఖర్ రైతులకు సూచించారు. బోడిగూడెం, మంగపతిదేవిపేట గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి పైర్లను పరిశీలించి కర్షకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటైన సమావేశాల్లో రైతులు మాట్లాడుతూ జింకు, జిప్సం, బోరాన్ తదితర సూక్ష్మధాతు పోషకాలను రాయితీ ధరలకు అందించాలని కోరారు. అయిదెకరాలకు పైబడిన రైతులకు బిందుసేద్య పరికరాలపై కనీసం 70శాతం రాయితీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. యంత్రపరికరాలను వ్యక్తిగత రాయితీపై మంజూరు చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు, బోడిగూడెం సర్పంచి గడ్డియ్య, నాయకులు నక్కా రవి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం కొత్తపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ పాల్గొని అధిక దిగుబడుల సాధనకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్పంచి జి.కృష్ణకుమారి, వ్యవసాయాధికారి మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఉద్యోగుల అరెస్టు

లింగపాలెం, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ప్రభుత్వ మద్యం దుకాణానికి సంబంధించి రూ.7,30,670 జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్న సూపర్‌వైజర్లు డి.అజయ్ కుమార్, ఎం.శ్రీకాంత్‌లపై ఎక్సైజ్ ఎస్సై నరసింహం ఇటీవల ధర్మాజీగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులను మంగళవారం అరెస్టు చేసి చింతలపూడి న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న తెలిపారు.

జూద స్థావరాలపై దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సోమవారం అర్ధరాత్రి దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, రూ.14,860, తొమ్మిది ద్విచక్ర వాహనాలు, కోడి, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: కామవరపుకోట మండలం గుంటుపల్లి శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై మంగళవారం దాడి చేసి, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.20 వేలు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు



వివరాలు తెలుసుకుంటున్న శ్రీలత

కైకలూరు, న్యూస్‌టుడే: దరఖాస్తుల అనంతరం లాటరీ విధానంలో మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నూతన మద్యం దుకాణాలకు జరుగుతున్న దరఖాస్తుల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎక్కడ నుంచైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్సైజ్ సీఐ రమేష్ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించబోం



నూజివీడు: మాట్లాడుతున్న రాఘవేంద్రనాథ్

నూజివీడు, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆదర్శ గ్రామాలే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవోలు సి.రాఘవేంద్రనాథ్, బి.భార్గవి తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, గ్రామీణ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దూర దృశ్య సమావేశంలో 'పల్లె పండగ' కార్యక్రమంపై దిశనిర్దేశం చేశారు. అనంతరం నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసౌకర్యాల బస్టాండ్



అపరిశుభ్రంగా మంచినీరు తాగే ప్రాంతం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ అసౌకర్యాలకు నిలయంగా మిగిలిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమాత్రం పరిశుభ్రత లేని ఆవరణంలో కూర్చోవాలన్నా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కుర్చీలు ఉన్న ప్రాంతంలో పంకాలు వేయడం లేదని, ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. తాగునీరు తాగే ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని, పంపులు కూడా సరిగా లేక తాగేందుకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ పవన్‌కుమార్‌ను సంప్రదించగా.. బస్టాండ్ ఆవరణ, తాగునీటి సౌలభ్యం ఉన్న ప్రాంతాల్లో శుభ్రం చేయిస్తామన్నారు. తిరగని పంకాల గురించి అడగగా నిత్యం తిరుగుతూనే ఉన్నాయని, ఎవరో ఆపి ఉంటారని పేర్కొన్నారు.



భవనంపై పెరుగుతున్న మొక్కలు

దారులు నరకానికి నకళ్లు!



సింహాద్రిపురం సెంటర్‌లో..



నాగేంద్రపురం వద్ద గుంతలో నిలిచిన వర్షపు నీరు

ముసునూరు, న్యూస్‌టుడే: అవి దారుల కాదు.. నరకానికి నకళ్లు.. ఏ రోడ్డు చూసినా అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు.. వాటిపై ప్రయాణమంటే ప్రమాదం వైపు పయనమే. కొనేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో తారు లేచి, కంకర తేలిన రహదారులు మట్టి రోడ్ల కంటే దారుణంగా దర్శనమిస్తున్నాయి. పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారాయి. అయినా విధిలేని పరిస్థితుల్లో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఎంత ఖరీదైన కారులోనైనా పది కిలోమీటర్లు వెళ్లేసరికి ఒళ్లు హూనమవుతోంది. ఆర్టీసీ బస్సులు, ఆటోల్లోనూ, ద్విచక్ర వాహనాలపైనా ప్రయాణించే వారి పరిస్థితి అయితే నిత్యం నరకమే. నూజివీడు నుంచి పోతురెడ్డిపల్లి, సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం మీదుగా ఏలూరు వెళ్లే రహదారే దీనికి నిదర్శనం. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్‌బాబు మాట్లాడుతూ.. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



నూజివీడు సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268 | కలిదిండి: 90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం బాపునగర్‌లో ఎలిమెంటరి స్కూల్ ప్రాంతంలో నాలుగు వీధి దీపాలు వెలగడం లేదు.
- బొడ్డు రాజు, నూజివీడు

సమాధానం: వెంటనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: గోపవరంలో ప్రధాన రహదారి వెంబడే చెత్త వ్యర్థాలు పడేస్తున్నారు. పశువులు అక్కడే తిష్ఠ వేసి వ్యర్థాలను రోడ్డుపై చెల్లాచెదురుగా పడేస్తున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- కృష్ణప్రసాద్, వాహనదారుడు

సమాధానం: చెత్త, వ్యర్థాలు తొలగించి రోడ్డు పక్కన వేయకుండా చర్యలు చేపడతాం.
- వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, గోపవరం

బాధ్యతల స్వీకరణ

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలంలో నూతనంగా పలువురు కార్యదర్శులు మంగళవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. బలివే కార్యదర్శిగా కె.ధర్మరాజు ఉంగుటూరు మండలం ఏ.గోకవరం నుంచి, వేల్పుచర్ల కార్యదర్శిగా బి.శ్రీనివాస చౌదరి దెందులూరు మండలం రామారావుగూడెం నుంచి, రమణక్కపేట కార్యదర్శిగా పి.నాగబాబు కలిదిండి మండలం పెద్దలంక నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలంలో ఇటీవల బదిలీ అయిన రెవెన్యూ ఉద్యోగులకు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. తహసీల్దారు పీవీఎస్వీ ప్రసాద్, ఉప తహసీల్దారు జి.పవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● ఆగిరిపల్లి మండలంలో పలువురు రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నూతనంగా వచ్చిన వారు బాధ్యతలు చేపట్టారు. ల్యాండ్ రీ సర్వే ఉప తహసీల్దారు లక్ష్మీనాంచారమ్మ నూజివీడుకు, ఆమె స్థానంలో ముదినేపల్లి నుంచి పి.మరియన్న బదిలీపై వచ్చారు. ఆర్.ఐ. నవీన్ కుమార్ అమరావతి సచివాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్.ఐగా ఎండీ యూనస్ బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ కైకలూరు నుంచి బదిలీపై వచ్చారు. కనసానపల్లి వీఆర్వో పి.విఘ్నేశ్వరరావు, ఎస్.ఎ.పేట వీఆర్వో దుర్గ ఎన్టీఆర్ జిల్లాకు, ఈదులగూడెం వీఆర్వో వై.శ్రీనివాసరావు, కృష్ణవరం వీఆర్వో శామ్యూల్ కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకోవాలి



కొర్రగుంటపాలెంలో రైతులతో మాట్లాడుతున్న హబీబ్ బాషా

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. పెదగొన్నూరు, కొర్రగుంటపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించి సాగు ఖర్చులను తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరం మట్టి నమూనా పరీక్షా కార్డులు పంపిణీ చేశారు. ఏడీఏ జి.వెంకటరమణ, ఏవో వేణుమాధవ్, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సేంద్రీయ వ్యవసాయ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్, సర్పంచులు పేరే రామకృష్ణ, తాడంకి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ముందుకు రావాలి.. చాట్రాయి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేందుకు రైతులు ముందుకు రావాలని, వీటితో నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని ఏవో బండారు శివశంకర్ అన్నారు. ఆరుగోలనపేటలో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి పొలాలను రైతులతో కలిసి క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్రిమి సంహారక మందులు, ఎరువుల వినియోగంతో పెట్టుబడులు పెరుగుతాయన్నారు. తెదేపా నాయకులు ఇజ్జగాని వెంకటేశ్వరరావు, పుచ్చకాయల సత్యనారాయణరెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు కృషి చేయాలి: కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: త్వరలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న తరుణంలో డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా కూటమి శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. వరహాపట్నంలోని ఆయన నివాసంలో మంగళవారం తెదేపా, భాజపా, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను నిర్ణయించారని, ఆయన విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

అభివృద్ధి పనులపై చర్చ

నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నాయకులతో ఎమ్మెల్యే కామినేని చర్చించారు. నాలుగు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నూతన రోడ్ల ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. నీటి సంఘాల ఎన్నికలు త్వరలోనే పూర్తి చేసి పంట కాలువల ఆధునికీకరణ చేస్తామని. . ఇప్పటికే రైతుల సహకారంతో పుల్లవా డ్రెయిన్ పనులు ప్రారంభించామని, మరికొద్ది రోజుల్లో అన్ని డ్రెయినేజీలను క్రమబద్ధీకరిస్తామన్నారు. అవసరమైన గ్రామాల్లో విద్యుత్తు ఉప కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వంతెనలు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను నిర్మిస్తామని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ డైరెక్టరు కొడాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ప్రగతిలో వార్డు సభ్యులే కీలకం

ముసునూరు, న్యూస్‌టుడే: పంచాయతీ అభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులే కీలకమని ఎంపీడీవో జి.రాణి అన్నారు. మంగళవారం ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కొండ దుర్గాభవాని, సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఈవో పీఆర్డీ బీఏ సత్యనారాయణ, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు కోటగిరి రాజనాయన తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమం.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలపై ఆగిరిపల్లి మండలంలోని ఉప సర్పంచులు, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఆగిరిపల్లి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో బి.భార్గవి తెలిపారు.



మాట్లాడుతున్న దామోదర్

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావు ఉండొద్దు

మండవల్లి, న్యూస్‌టుడే: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల నిర్వహణలో అవినీతి, అక్రమాలకు తావు ఉండకూడదని ఉపాధి హామీ జిల్లా ప్రొసిడింగ్ అధికారి దామోదర్ అన్నారు. ఇటీవల మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించిన తరుణంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఏడాదికి మండల వ్యాప్తంగా రూ.7,06,90,000 పనులు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో మండలంలోని పులపర్రు గ్రామ సచివాలయ నిర్మాణానికి రూ.1.55 లక్షలు అదనంగా చెల్లించినట్లు గుర్తించి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల నుంచి ఆ నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో కూలీలకు సక్రమంగా పనులు కల్పించేలా చర్యలు తీసుకుని మస్తర్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. పలువురు మస్తార్లలో అవకతవకలు గుర్తించి రూ.28 వేలు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ అధికారులు పురుషోత్తం, సూర్యచక్రం, ఎంపీడీవో రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మకాలను పరిశీలిస్తున్న మహేంద్రనాథ్

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఈనాడు కథనాలకు స్పందన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: పట్టికలోని ధరలకే కూరగాయలు విక్రయించాలని మార్కెటింగ్ ఏలూరు జిల్లా ఉపసంచాలకుడు వి.మహేంద్రనాథ్ ఆదేశించారు. నూజివీడు పట్టణంలోని రైతు బజార్‌లో అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని 'ఈనాడు'లో 'పట్టికలో ధరొకటి.. అమ్మేది మరొకటి!' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి ఉన్నతాధికారుల ఆదేశంతో పరిశీలించినట్లు తెలిపారు. అధిక ధరలకు కూరగాయలు విక్రయించినట్లు గుర్తించామని, ఇకపై పట్టికలో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారుల నుంచి కూడా అభిప్రాయాలు సేకరించారు.

ఆకతాయిల కట్టడికి.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: దేవాలయాలుగా భావించాల్సిన పాఠశాలలకు సెలవు రోజుల్లో పర్యవేక్షణ కొరవడటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. దీనిపై సోమవారం 'ఈనాడు'లో 'బడుల్లో అసాంఘిక కార్యకలాపాలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎంఈవోలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్ కుమార్ స్పందించారు. పాఠశాలల్లో ఆకతాయిల ఆగడాల కట్టడికి చర్యలు చేపట్టాలని, వాచ్‌మ్యాన్‌లను అప్రమత్తం చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.


గోతులకు మోక్షం.. చాట్రాయి, న్యూస్‌టుడే: విస్సన్నపేట- వెలగలపల్లి రోడ్డులో చాట్రాయి సమీపంలో గోతులతో వాహనాల చోదకులు, ద్విచక్ర వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో ఈ నెల 1న ' మూడు దశాబ్దాలుగా.. విస్తరణకు నోచక!' శీర్షికతో వెలువడిన కథనానికి ర.భ.శాఖ డీఈ బాబూరావు స్పందించారు. చాట్రాయి- నరసాపురం గ్రామాల నడుమ ప్రమాదకరంగా మారిన గోతులను పూడ్చించారు.

కాపు, బలిజ సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడి నియామకం


కలిదిండి, న్యూస్‌టుడే: కాపు, బలిజ సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా కాళ్లపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు నల్లజర్ల మహేశ్‌ను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపకుడు చేగొండి హరిరామజోగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాధ-రంగా మిత్ర మండలి ఏపీ, తెలంగాణ అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి, కూటమి నాయకులు చిట్టూరి రవీంద్ర, నల్లగోపుల చలపతి, కాసా ప్రభాకర్, జడ్డు సుబ్రహ్మణ్యం తదితరులు మహేశ్‌ను అభినందించారు.



మహేశ్‌ను అభినందిస్తున్న నాయకులు



బలివేలో మహాలక్ష్మి



నూజివీడులో..



అల్లూరులో..



మండవల్లిలో..

వరప్రదాయనీ.. నమోస్తుతే

న్యూస్‌టుడే, బృందం: నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



గోపవరం: దుర్గాదేవి



ఆగిరిపల్లి: మహాలక్ష్మీదేవి



చనుబండ: అగ్ని గుండం వద్ద కలశాలతో మహిళలు

వేలం ప్రకటన

మహారాజశ్రీ కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 76/18 in O.S. 203/13
Between:-
పెరుమాళ్ళ పూర్ణచంద్రరావు ... D.Hr.
మరియు
మహమ్మద్ జాకీర్ హుస్సేన్ ... J.Dr.

పై నెంబరు E.P.లో J.Dr చెల్లించవలసిన డిక్రీ బాకీ మరియు వగైరాల వసూలు నిమిత్తం ది. 01-11-2024న ఉదయం గం॥ 10-30 ని॥ల నుండి పైన తెలిపిన కోర్టువారి యెదుట J.Dr. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో ఉన్న E.P. షెడ్యూలు దాఖలా యీ దిగువ ఆస్తిని వేలం వేయబడును. కావున కావలసినవారు పాటలో పాల్గొని పాడుకోవచ్చును.

షెడ్యూలు: క్రిష్ణాజిల్లా (ప్రస్తుతం ఏలూరు జిల్లా) కైకలూరు స॥రి॥ వారి యిలాకా కైకలూరు గ్రామ పంచాయతీ R.S.No. 473/2రు పూరా య॥ 6.47ట్లులో చ॥గ॥ 577.77లు తనఖా ఆస్తి (నివేశన స్థలమునకు)కి హద్దులు. **తూర్పు:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** బజాన్‌గారి స్థలము, **ఉత్తరము:** భీమవరం to గుడివాడ రోడ్డు.

గమనిక: J.Dr. తాలూకు SRO కైకలూరులోని తనఖా బాకీ Rs. 5,00,000/-లకు లోబడి వేలము పాడుకొనవలయును.

D.Hr విలువ: Rs. 10,00,000/-
అమీనా విలువ: Rs. 1,51,00,000/-

అడివి వెంకటరమణ
D.Hr. తరపున అడ్వకేట్, కైకలూరు.
సెల్: **94411 76997**
94413 06840

వేలం ప్రకటన

మహారాజశ్రీ కైకలూరు సివిల్ జడ్జివారి కోర్టులో (సీనియర్ డివిజన్)
ఇ.పి.నెం.20/2019 ఇన్ ఒ.యస్.నెం.318/2018

బిట్‌విన్:
చింతా రామచంద్రరావు ... డి.హెచ్.ఆర్/వాది
మరియు
గాదిరాజు సూర్యనారాయణరాజు ...జె.డి.ఆర్/ప్రతివాది

పై నెంబరు ఇ.పి.లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కైకలూరు సివిల్ జడ్జి కోర్టులో (సీనియర్ డివిజన్) ది.23-10-2024వ తేదిన ఉదయం 10.30 ని॥ల లగాయితూ శ్రీ కోర్టు వేళలో వేలం వేయుదురు. కావసినవారు పాడుకొనవచ్చును. ఎటువంటి ఎన్‌కంబ్రన్స్ లేని ఆస్తి అయివున్నది. వేలం షరతులు శ్రీ కోర్టువారి నుండి తెలుసుకొనవలెను.

షెడ్యూలు: పూర్వం కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, కైకలూరు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, కైకలూరు మండలం, కైకలూరు గ్రామ పంచాయతీ ఏరియాలోని కైకలూరు గ్రామములోని రీ.స.నెం.326/1 రు పూరా య.1.71ట్లలో య.0.06ట్లు ఖాళీ నివేశ్న స్థలమునకు హద్దులు.

తూర్పు: ఉమ్మడి దారి, **దక్షిణం:** మారుబోయిన పులిరాజు గారి స్థలం, **పడమర:** యక్కలి సుబ్బారావు గారి భూమి, **ఉత్తరం:** సయ్యద్ పాతిమున్నిసా వగైరాల భూమి.

డి.హెచ్.ఆర్ విలువ: రూ.7,00,000/–లు
అమీనా విలువ: రూ.20,00,000/–లు

సం/- **శ్రీ ఎ.రాంబాబు**
అడ్వకేట్, కైకలూరు
కైకలూరు (డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది)
తేది.07-10-2024 సెల్: 98660 45502

ఇక్కడ పని చేయక.. అక్కడికి పయనం..

చాట్రాయి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం నిర్వహించిన దూర దృశ్య సమావేశం సాంకేతిక సమస్యల కారణంగా చాట్రాయిలో పనిచేయక ఉపాధి సిబ్బంది ముసునూరు వెళ్లి హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వరకు 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిపై మార్గదర్శకాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉండగా ఇక్కడ సాంకేతిక సమస్యలను పరిష్కారం చేయకపోతే ఇకపై ప్రతి సమావేశానికి పక్క మండలాలకు వెళ్లాలంటే అధికారులకు ఇబ్బంది తప్పదు. పల్లె పండగలో చాట్రాయి మండలంలో 30 పనులకు రూ.2.78 కోట్లు నిధులు కేటాయించారు. ఇవే కాక మరో 7 పనులకు రూ.1.15 కోట్లు తాజాగా కేటాయించారు.

అవి ఇవి అన్నీ

అన్నదానానికి విరాళం.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే అన్నసమారాధనకు దాతలు మరింతగా సాయం అందించి సహకరించాలని ఆలయ సహాయ కమిషనర్ జి.గంగాశ్రీదేవి కోరారు. ఆలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పోరంకికి చెందిన నాగబోయిన దుర్గాఫణిరాజ్‌నాథ్, చిన్మయిలు రూ.11,116 నగదు అన్నదాన పథకానికి అందించారు.

భజన బృందానికి దుస్తుల వితరణ.. నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు మండలం సుంకొల్లులో బృందావనం చెక్క భజన సమాజం సభ్యులకు గోగినేని సత్యనారాయణ, అనురాధ చేతుల మీదుగా సోమవారం రాత్రి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల సమయంలో బృందావనం చెక్క భజన సమాజం సభ్యులు పాల్గొని భజన చేస్తారని, అందుకోసం వారికి తన మనవరాలు పుట్టిన రోజు సందర్భంగా 45 మందికి రూ.50 వేల విలువైన దుస్తులు వితరణగా అందించామన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, ఉద్యానశాఖ అధికారిణి జ్యోతి ప్రియాంక, జలసూత్రం వంశీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను అపహరించిన వ్యక్తిపై కేసు.. ముసునూరు, న్యూస్‌టుడే: బాలికను అపహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. ముసునూరు మండలం యల్లపురానికి చెందిన ఓ బాలికను (15) పెదవేగి మండలం రామచంద్రపురానికి చెందిన నాగులపల్లి ఏసురాజు ఈనెల 6న ఇంటికి వచ్చి బలవంతంగా తనతో తీసుకువెళ్లిపోయాడు. మంగళవారం బాలిక నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మత్తు పదార్థాలతో భవిత చిత్తు.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో యువత భవిత చిత్తు అవుతుందని జోనల్ సమన్వయకర్త కె.ప్రియాంక తెలిపారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై నవజీవన్ బాలభవన్, నీతోడు మానసిక వికాస కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డా.జె.జగన్మోహనరావు, ఎంపీహెచ్‌ఈవో జి.రత్నబాబు సిబ్బంది పాల్గొన్నారు.